రాజేంద్రనగర్ డిపోను సందర్శించిన సుధా పరిమళ


డిపో సిబ్బందితో మాట్లాడుతున్న సుధా పరిమళ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డిపోను గురువారం హైదరాబాద్ రీజియన్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుధా పరిమళ సందర్శించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డిపోలోని అన్ని సెక్షన్లను సందర్శించారు. అదే విధంగా డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించి డిపో సిబ్బందితో వారి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి తమ డ్యూటీలకు అబ్సెంట్ కాకుండా ప్రతిరోజూ డ్యూటీకి హాజరుకావాలని..ఫేయిర్ పెయిడ్ ఈపీకేను ఎలా పెంచాలి అనే విషయంపై వారికి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.కృష్ణ రెడ్డి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తాన్‌పల్లిలో రెవెన్యూ సదస్సు


ఫిర్యాదు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

శంషాబాద్ రూరల్: సుల్తాన్‌పల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్‌ఓఆర్ 2025 భూభారతి చట్టం అమలులో భాగంగా భూవివాదాల పరిష్కారం కోసం ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నాయబ్ తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఫిర్యాదు స్వీరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సారిక, మాజీ సర్పంచు సిద్దేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం



శంషాబాద్: ధర్మసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శివదత్తసాయి ఆధ్వర్యంలో బాబా పల్లకీ సేవ, హారతి, అభిషేక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

నియామకం


శ్రీనివాస్ యాదవ్


యాదయ్య ముదిరాజ్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్‌ను నియమిస్తూ గురువారం టీఎస్‌జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేనీ ముజీబ్ ప్రకటించారు. కన్వీనర్‌గా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎస్.యాదయ్య ముదిరాజ్‌ను నియమించారు. చైర్మన్, కన్వీనర్‌ల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ తాలుకాలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్వ విద్యాలయాల ఉద్యోగులు పని చేస్తారన్నారు. గతంలో తాలుకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా ఉన్న ఎం.ఏ.నయీమ్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఎం.శ్రీనివాస్ యాదవ్‌ను నూతన చైర్మన్‌గా నియమించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాజేంద్రనగర్: వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన అన్ని డీఏలు, మెడికల్ బిల్లులు, హెల్త్ కార్డులు అందించేందుకు టీఎన్‌జీఓస్ రాష్ట్ర సంఘం కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేనీ ముజీబ్ అన్నారు. రాజేంద్రనగర్ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇటీవల గెలిచిన వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్.ఎం.హుస్సేనీ ముజీబ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ నగర కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, కార్య నిర్వాహక కార్యదర్శి రాజ కుమారి, ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



జలం.. ఇంకితేనే జీవనం

- ఇంకుడుగుంతలపై కొరవడిన శ్రద్ధ
- వర్షం నీరంతా వృథా
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- పట్టించుకోని అధికారులు


అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఇంకుడు గుంతకు మరమ్మతులు చేసిన సిబ్బంది (ఫైల్)

మణికొండ: ప్రతి 300 గజాలకు పై బడిన ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో తప్పనిసరి ఇంకుడు గుంత ఉండాలి.. ఇదీ జలమండలి వారి ఆదేశం. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామని అఫిడవిట్‌లు ఇస్తేనే అనుమతులు ఇస్తాం.. ఇదీ హెచ్ఎండీఏ, మున్సిపాలిటీల వారి ఉత్తర్వులు. వారి ఆదేశాలు, ఉత్తర్వులు కాగితాలపైన పదిలంగానే ఉంటున్నా ఆచరణలో అమలు కావటం లేదనేది అక్షర సత్యం.

◆ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న అపార్ట్‌మెంట్‌లు, జనాభాతో నిత్యం లక్షలాదిగా లీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. దాంతో భూగర్భజలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. వేసవి ప్రారంభంకాక ముందే అంటే ఫిబ్రవరి నుంచే చాలా బోర్లు వట్టిపోతున్నాయి. జలమండలి వారు తూతూ మంత్రంగా సమయం తగ్గించి నీటిని సరఫరా చేస్తున్నారు. దాంతో నీటికి కటకట ఏర్పడి ప్రైవేటు, జలమండలి ట్యాంకర్లపై ఆధారపడి అనేక అపార్ట్‌మెంట్‌ల వాసులు జీవనం సాగిస్తున్నారు.

◆ లక్షలాది రూపాయలు పెట్టి ఏడాదికో బోరు వేస్తున్న వారు రూ. 20 వేలల్లో పూర్తయ్యే ఇంకుడు గుంతలపై ధ్యాస పెట్టకపోవటంతో నీటి కొరత ప్రతి సంవత్సరం పెరిగుతూనే ఉంది. మణికొండ మున్సిపాలటీలో ఏకంగా వెయ్యి నుంచి రెండు వేల అడుగులు బోరు వేస్తే కానీ నీరు రాని పరిస్థితి నెలకొంది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 500 అడుగుల నుంచి వెయ్యి అడుగులకు భూగర్భజాలాలు దిగిపోయాయి.

పట్టించుకోని యంత్రాంగం...

ప్రతి మున్సిపాలిటీలో వీలున్నన్ని ఎక్కువ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయించాల్సిన జలమండలి, మున్సిపాలిటీ, హెచ్ఎండీఏ అధికారులు ఆ విషయాన్ని అంతగా పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. గతంలో జలమండలి, ఓ ఎన్‌జీఓ సంస్థ కలిసి మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పక్కన వందల సంఖ్యలో లక్షలు ఖర్చు చేసి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. అవి ఉన్నన్ని రోజులు భూగర్భ జలాలు పెరిగి, బోర్లు వట్టిపోవటం సమస్య అంతగా రాలేదు. వాటి నిర్వహణ, కొత్తవి ఏర్పాటు చేసే విషయాన్ని ఇటీవల సంవత్సరాల్లో పట్టించుకోకపోవటంతో అవి నిర్వీర్యమయ్యాయని పలు కాలనీల ప్రజలు తెలిపారు.

◆ దీంతో వర్షపు నీరంతా వృథాగా రోడ్లపై పారి వాగుల ద్వారా మూసీ నదికి చేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అప్పటికే ఉన్న ఇంకుడు గుంతలను ప్రతి సంవత్సరం మరమ్మతులు చేసి మనుగడలో ఉంచటం, వీలున్న చోట కొత్తవి ఏర్పాటు చేయాల్సిన బాధ్యతను అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

పావు శాతం లేని ఇంకుడు గుంతలు..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నుల లెక్కల ప్రకారం 50,279 గృహాలు ఉన్నాయి. వాటిల్లో అపార్ట్‌మెంట్‌లు, వ్యక్తిగత గృహాలు ఉన్నాయి. వాటిల్లో సుమారు ఐదు వేల వాటిల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 31,384 నివాసాలు ఉన్నాయి. వాటిల్లోనూ ఐదు వేల వరకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి. నివాసాలవి కాకుండా రోడ్ల పక్కన రెండు మున్సిపాలిటీల్లోను ఐదు వందల వరకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీలు, జలమండలిలపై ఉంది. అందుకు భిన్నంగా రెండు మున్సిపాలిటీల పరిధిలో వందలోపు రోడ్ల పక్కన ఉండగా, నివాసాల్లో కేవలం 1100 మాత్రమే ఉండటంతో వర్షం నీటిని ఏ మేరకు భూమిలోకి ఇంకిస్తున్నామనే విషయాన్ని ఇకనైనా అధికారులు గమనించి అందుకు అనుగుణంగా వర్షాలు కురిసేలోపు యుద్ధప్రాతిపదికన సాధ్యమైనన్ని ఎక్కువ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని జంట మున్సిపాలిటీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


పంచవటి కాలనీలో కనుమరుగైన ఇంకుడు గుంత

అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులచే గ్రౌండింగ్ చేయడం అలాగే గతంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి కలిగిన వారు ప్రస్తుతం ఆసక్తి చూపనందున వారి స్థానంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభంకానున్న సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, కాలేజీల్లో పారిశుధ్య సేవలు సోమవారం నుంచి బుధవారం లోపు పూర్తి చేయాలన్నారు. ఎలక్ట్రికల్ లైట్లు, ఫ్యాన్లు పని చేసేటట్లు చూడాలని అవసరమైతే రిపేర్ చేయాలన్నారు. సంబంధిత వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు ఈ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

దిమ్మెలను తొలగిస్తే చర్యలు తప్పవు

సాక్షి ఎఫెక్ట్..

రాజేంద్రనగర్: 'సాక్షి'దినపత్రి రాజేంద్రనగర్‌లో గురువారం ప్రచురితమైన 'డివైడర్‌ను తొలగించి యథేచ్ఛగా రాకపోకలు' అనే శీర్షికపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ స్పందించారు. ఉదయం పీవీ నరసింహారావు పిల్లర్ నంబర్ 294 వద్ద తనిఖీ చేసి భారీ దిమ్మెలను సరి చేయించారు. వాహనాలు వెళ్లకుండా దిమ్మలను ఏర్పాటు చేయించారు. కేవలం పాదచారులు మాత్రమే దాటేలా చిన్నపాటి దారి వదిలి భారీ దిమ్మెలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..ఈ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రం కావడంతో తాత్కాలికంగా మూసివేసి మరికొద్ది దూరం నుంచి యూ టర్న్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొందరు దిమ్మెలను తీసి ద్విచక్ర వాహనాలతో రాకపోకలు సాగిస్తున్నారని..వారి గుర్తించి చలాన్ విధిస్తామన్నారు. దిమ్మెలను తొలగిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


దిమ్మెలను సరి చేయించిన ట్రాఫిక్ పోలీసులు

నర్ఖూడను సందర్శించిన బిహార్ రాష్ట్రం సర్పంచుల బృందం



శంషాబాద్ రూరల్: బిహార్ రాష్ట్రం సర్పంచుల బృందం గురువారం మండలంలోని నర్ఖూడలో పర్యటించింది. శిక్షణలో భాగంగా ఎన్ఐఆర్డీ ఆధ్వర్యంలో వీరు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వారికి వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్డీ ప్రోగ్రాం డైరక్టర్ అరుణ జయమణి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


బాలమ్మ

మణికొండ: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. కోకాపేట సెక్టార్ ఎస్సై మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం..ఖానాపూర్ గ్రామానికి చెందిన రామేశ్వరం బాలమ్మ ప్రతిరోజు మాదిరిగానే మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వాకింగ్‌కని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధులు, మిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె కోడలు లక్ష్మి గురువారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అత్త కనిపించకుండా పోవడంపై అదే గ్రామానికి చెందిన అనిత అనే మహిళపై అనుమానం వ్యక్తం చేసి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


మణికొండలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, మేనేజర్


లక్ష్మీనగర్ పార్కులో మొక్కలు నాటుతున్న కనకయ్య తదితరులు

మణికొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, నార్సింగి మున్సిపాలిటీ టీపీఓ మణిహారిక, సీబీఐటీ, ఎంజీఐటీ ప్రిన్సిపాల్‌లు సీవీ నరసింహులు, జి.చంద్రమోహన్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం, మున్సిపాలిటీల వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మణికొండ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి తిరుమలహిల్స్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించి పార్కులో మొక్కలు నాటారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట చెరువు వద్ద మహిళా సంఘాల వారితో మొక్కల పెంపకంపై ప్రమాణం చేయించి మొక్కలు నాటారు. సీబీఐటీ, ఎంజీఐటీ కళాశాలల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. మణికొండ కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి మొక్కలు నాటారు.

లక్ష్మీనగర్ పార్కులో..

అత్తాపూర్: లక్ష్మీనగర్ పార్కులో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని 'పర్యావరణ రక్షణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర'అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ ఎకానమిక్ ఫోరం అధ్యక్షుడు నేదునూరి కనకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి అనీల్‌కుమార్, బ్రహ్మయ్యనాయుడు, మాజీ సైనికుడు వెంకటరెడ్డి, దామ సత్యనారాయణ, కె.శంకర్, కె.కృష్ణ, ఎం.నర్సింహారావు, బుచ్చయ్య, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి..

బండ్లగూడ: పర్యావరణానాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అమృత్ 2.0లో భాగంగా పీరంచెరువు కట్టపై వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ అధికారులు ఫెబల్‌సిటీ లేక్ వాలెంటీర్స్, జేఎస్ఆర్ఎం కాలనీ వాసులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో ర్యాలీ, స్వచ్ఛ వాక్‌ను చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈ.మంజులత, టి.పర్వతాలు, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వివిధ సెక్షన్‌ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ధృవాన్ష్ సంస్థకు అవార్డు



హైడ్రా కమిషనర్ నుంచి అవార్డు అందుకున్న మధులిక

మణికొండ: పలు మున్సిపాలిటీల పరిధిలో చెరువుల పరిరక్షణ, పర్యావరణం, జీవవైవిధ్యాన్ని కాపాడుతున్న ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అవార్డును అందజేశారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైడ్రా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు మధులికకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నెక్నాంపూర్ చెరువు నుంచి ప్రారంభమైన తమ ప్రస్థానం పది చెరువులకు చేరిందన్నారు. చెరువులు బాగుంటే పర్యావరణం బాగుండటంతో పాటు అనేక జీవరాశులు జీవించే అవకాశం కలుగుతుందన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని చెరువులను పరిరక్షిస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వాంబే కాలనీ, రాజీవ్ గృహ కల్పలలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. పైపులైన్ వ్యవస్థ దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అదే విధంగా అపార్ట్‌మెంట్‌లో డ్రైనేజీ లైన్ కుంగిపోయి ఉన్నా పరిస్థితి, ఫ్లోరింగ్ పనులకు అధికారులతో చర్చించారు. తాగునీటిలో వ్యర్థాలు కలవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, హనుమంత్‌రెడ్డి, పాండుయాదవ్, మధుసూధన్‌రెడ్డి, అరుణ్, మాలతీ, లక్ష్మి, జయంతి, ఆండాలు, నరసమ్మ, రవీందర్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపాలిటీకి అవార్డు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనాన్ని ప్రోత్సహించడం వంటి వాటిలో కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కింది. గురువారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణ మోహన్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పక్కన సంవత్సరం నుంచి మూడేళ్ల వయసు ఉన్న మొక్కలను నాటి పరిరక్షించామన్నారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్‌ల నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తలను వేరుగా సేకరించి ఘన వ్యర్థాలుగా, వర్మికాంపోస్ట్ ఎరువులుగా తయారు చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీ ప్రజలు, వ్యాపారులు సహరించటంతోనే ఇది సాధ్యమయ్యిందన్నారు.



మంత్రి నుంచి అవార్డు అందుకున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూభారతి చట్టం


గొల్లపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం భూభారతి చట్టం ద్వారా జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు, స్థానికులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలను పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అములుచేస్తోందన్నారు. భూముల విస్తీర్ణం, పాస్‌బుక్కులు లేకపోవడం, వారసత్వభూములు, భూ స్వభావం, తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదాబైనామా కేసులు, పార్ట్ బిలో చేర్చిన భూ సమస్యలు ఇలా అన్నింటిని పరిష్కరించేందుకు ఆర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. నిర్ణిత ఫార్మాట్‌లో రైతులు, భూ యజమానులు ఆర్జీలను అందజేయాలన్నారు. ఆర్జీలు స్వీకరణకు హెల్ప్‌డెస్క్‌లు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్ పాల్గొన్నారు.

మహవీర్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్


ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న సురేందర్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ను నిర్వహించడంతో బీటెక్, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్స్‌కు చెందిన 23 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో లూయిస్, టీవీఎస్, వీల్స్ ఇండియా లిమిటెడ్, రానే ఎక్స్‌పెండింగ్, హారిజన్, జెడ్ఎఫ్ కమర్షియల్ వెహికిల్స్ కంట్రోల్ కంపెనీలు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను సంరెడ్డి సురేందర్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్.జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, టీపీఓ ప్రతిభాభారతి పాల్గొన్నారు.

జోరుగా జీవాల విక్రయం

- మొదలైన బక్రీద్ సందడి
- ముమ్మరంగా గొర్రెలు, మేకల కొనుగోళ్లు
- ఆకాశాన్నంటుతున్న ధరలు

శాస్త్రిపురం: బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లిం నివసించే బస్తీలు సందడిగా మారాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచే మేకల అమ్మకాలు జోరుగా జరిగాయి. మేకలు, గొర్రెలు ఇతర జీవాలను పెద్ద మొత్తంలో వ్యాపారులు క్రయ విక్రయాలను నిర్వహిస్తున్నారు. నగరంలోని జియాగూడ, చంగిచర్ల, శివారు ప్రాంతాలైనా పెబ్బేరు ప్రాంతాల నుంచి జీవాలను తీసుకొచ్చి అమ్మకాలు జరిపారు. జీవాలతో పాటు అవి తినే గడ్డి అమ్మకాలు కూడా బాగా జరిగాయి. మూగజీవాల కొనుగోళ్లతో శాస్త్రిపురం, ఎంఎం పహడీ, హసన్‌నగర్, దానమ్మజోపిడీ ప్రాంతాలు కళకళలాడాయి.

వేలల్లో ధరలు..

మేకల కన్నా ముస్లింలు బక్రీద్ రోజున గొర్రెలను కోయడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. దీంతో మేకలకన్నా గొర్రెలే అధిక ధరలు పలికాయి. పది కిలోల గొర్రె రూ. 6500 నుంచి రూ. 9000 వరకు ధర పలికింది. మేకల ధరలు రూ. 6 వేల నుంచి సుమారు రూ.25 వేల వరకు బరువును బట్టి అమ్మినట్లు విక్రయదారులు తెలిపారు.

జోరుగా గడ్డి విక్రయాలు...

రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో సాధారణ రోజుల్లో చూద్దామన్నా పచ్చగడ్డి కనిపించదు. బక్రీద్ పుణ్యమా అని అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, చింతల్‌మెట్‌లో ఎక్కడ చూసినా గడ్డి కుప్పలుగా కనిపిస్తోంది. బక్రీద్ రెండు రోజులు ముందు మేకలు, గొర్రెలు కొనేవారు వాటిని తమ ఇళ్లల్లో మేపేందుకు గడ్డిని కొంటున్నారు. గడ్డికుప్ప సైజును బట్టి రూ.100 నుంచి రూ.600 వరకు ధర పలుకుతోంది.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న మేకలు


మేకల కోసం గడ్డి అమ్మకాలు